మేయర్ పదవికి వైఎస్సార్ సీపీ పోటీ

- త్వరలో అభ్యర్థి ఎంపిక
- కార్పొరేటర్లతో వైఎస్సార్ సీపీ నేతల సమావేశంలో నిర్ణయం
- 28న జరగనున్న మేయర్ ఎన్నికపై చర్చ



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన మోదుగుల వేణుగోపాలరెడ్డి, అప్పిరెడ్డి, వజ్రబాబు

పట్నంబజారు: గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ పదవికి అభ్యర్థిని పోటీలో పెట్టాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించింది. త్వరలో అభ్యర్థిని ఎంపిక చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మేయర్ పదవికి కావటి మనోహర్‌నాయుడు రాజీనామా చేసిన విషయం విదితమే. మేయర్ ఎన్నిక కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో ఈనెల 28వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్పొరేటర్లతో గురువారం భేటీ అయ్యారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, నగర డిప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు కార్పొరేటర్లతో పలు అంశాలపై చర్చించారు. 28వ తేదీన జరిగే నగర మేయర్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థిని పెట్టాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. మేయర్ అభ్యర్థి అంశాన్ని రాజ్యసభ సభ్యులు, పార్టీ గుంటూరు, కృష్ణా జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిలతో సంప్రదించిన తరువాత వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటించటం జరుగుతుందని పార్టీ నేతలు తెలిపారు. త్వరలోనే అభ్యర్థిని ప్రకటించటం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ప్రభుత్వ తీరు హాస్యాస్పదం

లక్ష్మీపురం: అమరావతిలో లక్ష కోట్లు ఖర్చు పెడుతున్నామని ఆ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారని రాష్ట్ర ప్రభుత్వం తెలపడం హాస్యాస్పదంగా ఉందని కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరావు (సంగమ్)గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని పేరుతో వ్యాపార సామ్రాజ్యం నిర్మిస్తున్నట్టుగా ఉందని విమర్శించారు. గతంలో మట్టి మాత్రమే ఇచ్చాడని నరేంద్ర మోదీని విమర్శించిన వాళ్లే ఇప్పుడు ఆయనను మళ్లీ పిలవడంలో ఆంతర్యమేమిటని, సిగ్గు మీకైనా ఉండాలి మాకైనా ఉండాలి అని మేము అనుకుంటే ఆ తప్పు ఎవరిది అని ప్రశ్నించారు.

ఉగ్ర దాడిపై న్యాయవాదుల నిరసన



గుంటూరు లీగల్: పహల్గామ్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన మారణకాండను గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యంగలశెట్టి శివసూర్యనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, న్యాయవాదులు అధిక మొత్తంలో పాల్గొని మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విజేత ఐఐటీ స్కూల్ విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గోరంట్లలోని విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. డి.లక్ష్మీ జాహ్నవి 593 మార్కులతోపాటు 575కు పైగా 22 మంది, 550కు పైగా 60 మంది, 500కు పైగా 128 విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

టెన్త్ ప్రతిభావంతులకు అభినందన సభ



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన కెనడీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు అభినందించారు. అరండల్‌పేటలోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో 550కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. ఐజాక్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెన్త్‌లో సాయి ఆదిత్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సాయి ఆదిత్య హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు తెలిపారు. గురువారం శాంతినగర్‌లోని పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థిని షజ్జున 583, లోకేంద్రసాయి 583, ప్రవల్లిక రేణుశ్రీ 582, సాహిల్ షరీఫ్ 581 మార్కులతో పాటు 550కు పైగా 52 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాలలో 99.5 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఏవో కృష్ణారావు, సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అభినందనీయం



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాష్యం రామకృష్ణ, నిమ్మల శేషయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: పేద విద్యార్థులకు అందుబాటులో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించటం అభినందనీయమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ పక్కన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని భాష్యం రామకృష్ణ, ప్రముఖ వైద్యుడు నిమ్మల శేషయ్య ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ మంచి ఉద్దేశంతో, అతి తక్కువ ఫీజుతో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు దీనిని వినియోగించుకుని సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని అన్నారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల సమస్యలపై తన సాహిత్యం ద్వారా పోరాడిన గుర్రం జాషువా పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి కంప్యూటర్ శిక్షణ ఇవ్వటం అభినందనీయం అన్నారు. ఈ సంకల్పానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. జాషువా విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు కె.నళినీకాంత్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించాలనే లక్ష్యంతో కంప్యూటర్ ల్యాబ్‌కు సహకారం అందించిన నాగెళ్ల శివప్రసాద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. 365 రోజులు ఈ శిక్షణ కేంద్రం కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9951585679 నంబర్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ నిపుణులు అంకమ్మరావు, కృష్ణప్రసాద్, శిక్షణ కేంద్ర బాధ్యులు పి.సాంబశివరావు, స్థానిక నాయకులు బి.ముత్యాలరావు, షేక్ ఖాశిం వలి, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం చదివితే కొత్త ఆలోచనలు వస్తాయి



మాట్లాడుతున్న అచ్యుత ఇందుశేఖర్, వేదికపై అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: పుస్తకం చదవటం వల్ల సరికొత్త ఆలోచనలు వస్తాయని, రకరకాల అనుభూతులు, ఉద్వేగాలు, ఇప్పటివరకు తెలియని నిజాలు తెలుస్తాయని యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా 'పుస్తకం- ప్రియనేస్తం' అంశంపై గురువారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందుశేఖర్ మాట్లాడుతూ అర్థవంతంగా.. ఆనందంగా జీవించటానికి మన జీవితం మనకే కాక కొందరికైనా ఉపయోగపడేలా మలుచుకోవడం కోసం పుస్తక పఠనం ఉపయోగపడుతుందన్నారు. మనసును శుద్ధి చేస్తాయన్నారు. పుస్తక ప్రియులు, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కల్యాణం చంద్రశేఖర్ మాట్లాడుతూ నవ్వటానికి, స్ఫూర్తి పొందటానికి, తెలియని విషయాలు తెలుసుకోవడానికి పుస్తకాలు చదవటం అవసరమన్నారు. మాట్లాడటానికి ఎవరూ లేనప్పుడు..మాట్లాడటానికి ఏమీ లేనప్పుడు తాను పుస్తకాలు చదువుతానన్నారు. పదాల కోసం..అవి చెప్పే భావాల కోసం పుస్తకాలు చదువుతానన్నారు. ఒక పుస్తకం చదివినప్పుడల్లా కొత్త జన్మ ఎత్తినట్లు ఉంటుందన్నారు. ప్రపంచ ప్రసిద్ధ రచయిత విలియం షేక్ స్పియర్ జయంతి సందర్భంగా తన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త సత్యనారాయణ, రాజన్న మాస్టారులు ప్రసంగించారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వెంకట్‌ను సత్కరిస్తున్న విష్ణువర్ధన్ వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో గురువారం వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించి, విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా సృజనాత్మకతకు పదును పెట్టేలా వినోద, విజ్ఞాన కార్యక్రమాలతో శిక్షణా శిబిరాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. సాంకేతిక శిక్షణ నిపుణుడు జిల్లెళ్లమూడి వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే రోబోటిక్స్, మేధాశక్తికి పదును పెట్టే ఏఐ కోడింగ్‌ను నూతనంగా పరిచయం చేయడమనేది కీలకమన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతిదేవి, సమన్వయకర్తలు దోసకాయల దుర్గాశ్యామ్, తిరువీధుల శ్రీదేవి పాల్గొన్నారు.


భారతి సిమెంట్ ఉత్పత్తులపై అవగాహన



సైట్ కన్‌స్ట్రక్షన్ వద్ద అవగాహన కల్పిస్తున్న భారతి సిమెంట్ బ్రాంచి హెడ్ తదితరులు

నగరంపాలెం: జిల్లాలో భారతి సిమెంట్ ఉత్పత్తులపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ మేరకు డీలర్లు, నిర్మాణ సముదాయాలను సందర్శించారు. భారతి సిమెంట్ నాణ్యత, నిర్మాణాలకు సంబంధించి ఎలా ఉపయోగించాలి, కాంక్రీట్ మన్నికపై సమావేశాలు ఏర్పాటు చేసి విపులంగా వివరించారు. బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. డీలర్లు, కన్‌స్ట్రక్షన్ సైట్ నిర్వాహకుల సందేహాలను నివృత్తి చేశారు. కంపెనీ అందిస్తున్న సేవలను వివరించారు. భవన సముదాయాలు, ఇళ్లు ధృడంగా ఉండేందుకు భారతి సిమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో విజయవాడ బ్రాంచి హెడ్ కె.మల్లికార్జున రెడ్డి, సీనియర్ జీఎం టెక్నికల్ హెడ్ సి.ఓబుల్‌రెడ్డి, గుంటూరు అసిస్టెంట్ మేనేజర్ పి.సురేష్, సీనియర్ టెక్నికల్ అధికారి పి.భవానీశంకర్ పాల్గొన్నారు.

మహబూబు సుభాని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



లక్ష్మీపురం: హజ్రత్ మహబూబు సుభాని 17వ మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్‌బాద్ షా ఖాదిరి దర్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మహబూబ్ సుభాని వారి 23వ మనువలు సయ్యద్ షా సులేమాన్‌ఖాదిరి ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని, మొహీయుద్దీన్‌పాలెంలో హజ్రత్ గౌసుల్ ఆజం దస్తగిర్ (మహబూబ్ సుభాని) వారి 17వ మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్‌బాద్ షా ఖాదిరి వారి దర్గాలో పీఠాధిపతి సమక్షంలో బాబా సమాధికి పూలతో అలంకరించి, ధూపాలతో ప్రత్యేక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జెడ్పీలో పంచాయతీరాజ్ దినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. జెడ్పీ అకౌంట్స్ అధికారి పి.శామ్యూల్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1957లో బల్వంతరాయ్ మెహతా సిఫార్సుల మేరకు మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. బల్వంతరాయ్ మెహతా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు శివన్నారాయణ, రాజా రత్నబాబు, కూచిపూడి మోహన్, తోట ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన మహా మంజీరనాదం





నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న మహా మంజీరనాదం -2025 గురువారం రెండో రోజుకి చేరాయి. శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, పాలక మండలి ఉపాధ్యక్షుడు లంక విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం ఆతీరా ఎ.వర్మ (కొట్టాయం, కేరళ) కూచిపూడి నృత్యాన్ని, లక్ష్మీనాయర్ (తిరువనంతపురం, కేరళ) మోహిని ఆట్టం నృత్యం, పేరిణి కిరణ్(హైదరాబాద్) పేరిణి నృత్యాన్ని ప్రదర్శించారు. కళారత్న రాయన గిరిధర్‌గౌడ్ మాట్లాడగా, కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సంస్థ కార్యదర్శి కళారత్న డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం సత్కరించారు.

నేడు స్ట్రోక్‌పై ప్రత్యేక కార్యక్రమం

గుంటూరుమెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సహకారంతో స్ట్రోక్‌పై శుక్రవారం భారతీయ విద్యాభవన్‌లో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ముఖ్యఅతిథిగా, స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, సెక్రటరీ డాక్టర్ అరవింద్‌శర్మ విచ్చేస్తున్నట్లు రొటేరియన్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలి

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతి



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం వల్ల మరణించినా, ప్రమాదాలు జరిగినా వారిని ఆదుకునే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అధికారంలోకి రాగానే భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని యువగళం పేరుతో నిర్వహించిన యాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలు పరచకపోవడం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల టీడీపీకి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 6000 పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే భవన నిర్మాణ కార్మికులు ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబురావు, కోటేశ్వరరావు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే టీచర్ పోస్టు గ్యారంటీ

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, టీఎస్ రామన్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టవచ్చని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని కాంపిటీషన్ సక్సెస్ కళాశాలలో గురువారం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మణరావు ఎడ్యుకేషనల్ సైకాలజీ పుస్తకాలను ఆవిష్కరించారు. డీఎస్సీ–2025 ద్వారా ప్రకటించిన 16,347 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అభ్యర్థులు చక్కటి ప్రణాళికతో చదవడం ద్వారా పరీక్షలో ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని పేర్కొన్నారు. 80 మార్కులకు జరిగే పరీక్షలో సైకాలజీ, జీకే, కరెంట్ అఫైర్స్, కంటెంట్ మెథడాలజీ, తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయని చెప్పారు. సిలబస్‌ను పూర్తిగా అధ్యయనం చేసుకుని, పాత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. పాయింట్స్ వారిగా నోట్స్‌ను ప్రిపేర్ చేసుకుంటూ మెథడాలజీ కోసం తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కాంపిటీషన్ సక్సెస్ కళాశాల డైరెక్టర్ టీఎస్ రామన్ మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా డీఎస్సీ పరీక్షల ద్వారా వందలాది మందిని ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులచే చక్కటి ప్రణాళికతో సిలబస్ అందిస్తున్నామని, శిక్షణ పొందే ప్రతి ఒక్కరూ ఉద్యోగ అర్హత పొందాలని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, నవీన్‌కుమార్, వెంకట్, కుసుమకుమార్, ఫణికుమార్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడి అమానుషం

ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్



ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది.

కొరిటిపాడు(గుంటూరు): ఉనికి కోసం అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుద ముట్టించాలని, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి జే.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాన్ని ఖండిస్తూ అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాశ్మీరులో ప్రశాంతత నెలకొన్నదని ప్రజలు భావిస్తున్న సమయంలో అనేక మంది అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపడం దారుణమన్నారు. భద్రతా సౌకర్యాలను మరింత మెరుగుపరిచి, రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. పౌరుల మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు ఆర్‌వీ సుబ్బారావు, జి.కిషోర్, సురేష్, విజయ రాఘవ, ఉమామహేశ్వరరావు, శ్రీదేవి, సుమ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

డీఈవో సీవీ రేణుక



అబ్దుల్ కరీం దంపతులతో డీఈవో రేణుక, ఖాసిం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని డీఈవో సీవీ రేణుక పేర్కొన్నారు. ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సయ్యద్ అబ్దుల్ కరీం ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా గురువారం చౌతా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత ప్రాంగణంలోని అభినందన సభ నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సన్మార్గంలో నడిపించే ఉపాధ్యాయులను సమాజం గుర్తుంచుకుంటుందని అన్నారు. అబ్దుల్ కరీం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీవైఈవో జి.ఏసురత్నం, ఎంఈవోలు అబ్దుల్ ఖుద్దూస్, నాగేంద్రమ్మ, హెచ్ఎంలు షేక్ ఎండీ ఖాసిం, రాబియాబస్రీ, విశ్రాంత హెచ్ఎం బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: అరండల్ పేట నాలుగో లైన్‌లోని పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన కారుమంచి అమర తేజ అరండల్‌పేట 4వ లైనులోని ఒక ప్రైవేటు ఆఫీసులో పనిచేస్తున్నాడు. మార్చి 31 సాయంత్రం ఆఫీసు ముందు తన ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి తరువాతి రోజు వచ్చే సరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల పరిశీలించి, గుంటూరు బస్టాండ్ రైల్వే స్టేషన్ పరిధిలోని పార్కింగ్ ప్రదేశాల్లో పరిశీలించినా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.